# ముప్పదినాలుగవ ప్రసంగము

## వ్యసనము - బానిసత్వము.

తరువాతిరోజున స్వామివారు మొదలగువారు అందరును కూర్చొనియుండగా అక్కడకు టీ, పాలు మొదలగునవి తీసికొని సేవకులు వచ్చిరి. శ్రీనిత్యానంద స్వామివారు టీ త్రాగరు. కావున వారికి పాలు ఇచ్చిరి. అటులనే శ్రీప్రకాశానంద స్వామివారికికూడ పాలు ఇచ్చిరి.

స్వా. ప్ర. :—నేను పాలు త్రాగను. నేను టీ దాసుడను.

స్వా. ని. :—అయిన నేను పాలదాసుడను.

స్వా. ని. :—పాలుత్రాగువారిని పాలదాసు డనరాదు. వ్యసనరూపమున ఏదైన వస్తువు సేవించిననే అట్టివానిని ఆవస్తువునకు దాసుడ నెదరు.

*కామకిఙ్కరతాం ప్రాప్య సకామః సర్వకిఙ్కరః ।*
*కామేనైవ పరిత్యక్తో నిష్కామః కస్య కిఙ్కరః ॥*

"కోరికకు దాసుడయి సకాముడుగా నుండువాడు మాయిక పదార్థములకు అన్నిటికిని దాసుడే. కోరికలను త్యజించినవాడు నిష్కామి. అతడు ఎవరికి దాసుడు? అనగా ఎవరికిని దాసుడుకాడు."

## అసురగుణములు.

టీ మొదలగునవి సాధారణవస్తువులు. కాని వాస్తవమునకు మాయిక పదార్థములయందు కోరికను కలిగియుండుటయే బానిసత్వమునకు లక్షణము. ఇది అసురగుణము. ఒక అసురగుణము ప్రవేశించినవెంటనే మిగిలిన అసురగుణములు అన్నియు ఒకదానివెంట మరియొకటి ప్రవేశించును. గీత 16వ అధ్యాయమున అసురసంపదను వర్ణించుచు భగవానుడు ఇట్లు చెప్పెను:-

కామమాశ్రిత్య దుష్పూరం దమ్భమానమదాన్వితాః ।
మోహాద్గృహీత్వాఽసద్గ్రాహాన్ ప్రవర్తన్తేఽశుచివ్రతాః ॥

"దుష్పూర్వమగు కామమును ఆశ్రయించినందున దంభము, మానము, మదము అనుగుణములను పొంది పరిశుద్ధులుకాని అసురులు అవివేకముచే అశుభకరములగు నిర్ణయములను చేయుదురు. వారు వేదవిరుద్ధములగు కార్యములయందు ప్రవృత్తులగుదురు."

దుష్పూరము :—జీవితమంతయు విషయములను అనుభవించినను విషయాభిలాష పూర్తి అవదు. అట్టిది కామము.

న జాతు కామః కామానాముపభోగేన శామ్యతి ।
హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే ॥

"ఎన్నిపదార్థములను అనుభవించినను కామము శాంతించదు. నేయి, కట్టెలు మొదలగునవి వేయుటచే అగ్ని వృద్ధిపొందునట్లు పదార్థములను అనుభవించుటచే కామము రోజురోజుకు వృద్ధి పొందును."

ధర్మమునందు నమ్మకములేకపోయినను బైటిజనులకు చెప్పుటకు కర్మ, ఉపాసనాదులు చేయుట దంభము. యథార్థముగా పూజ్యత్వమును పొందుటకు అయోగ్యుడయినను జనులఎదుట తన పూజ్యత్వమును ప్రకటింపదలచుట మానము. తనయందు గొప్ప లేకపోయినను ఇతరులను నిందించి ప్రజలఎదుట తనగొప్పను ప్రకటించు మనస్తత్త్వము మదము.

మోహము అనగా అవివేకము. దంభము, మానము, మదము ఈమూడు అసురగుణములను కలిగియున్నవారు మోహమాత్రముచే నిస్సారపదార్థములను గ్రహించెదరు.

ఇట్టి ఆసురపురుషులు దురాగ్రహరూపమగు అశుభనిశ్చయమును అవివేకము మోహముచే గ్రహించి అసుర ప్రవర్తనపదా

యణులగుదురు. ఇట్టి అసురవ్రతస్థులు వర్ణాశ్రమధర్మరహితమును, వేద విరుద్ధమును అగు కర్మమునందు ప్రవృత్తులగుదురు.

ఇట్లు ఒక అసురగుణము ప్రవేశించినంతనే మిగిలిన అసుర గుణములు అన్నియును ఒకదానివెంబడి మరియొకటి వచ్చివేయును.

## అ సు ర గు ణ ప రం ప ర.

ఒకసన్యాసిమఠమున ఒకవంటవాడు ఉండెడివాడు. అతనికి ఒక కుమారుడు ఉండెను. ఆబాలుడు చిన్నతనమునుండియు స్వాములసేవయందు శ్రద్ధగలిగియుండెడివాడు. వారివద్ద చదువు కొనెడివాడు. ఇట్లు ఆతడు విద్వాంసుడయ్యెను.

మఠమునందు స్వాములను జనులు ఎక్కువగా పూజించుట యును, గౌరవించుటయును చూచి ఆతనికి తాను సన్యాసి అయినచో జగత్తునందు చాలగౌరవము కలుగుననియు, మఠాధిపత్యమునొంది పూజించబడవచ్చుననియు తోచెను. ఆవిధముగా తలచి ఆతడు సన్యా సమును తీసికొనుటకు నిశ్చయించెను. ఈసంగతి తెలిసికొని తండ్రి మిత్రుడొకడు తండ్రితో నిట్లు చెప్పెను:—

“నీకు ఒక్కడే కుమారుడు. ఆతడు ఇప్పుడే సన్యాసమును తీసికొనుట మంచిదికాదు. ఇంకను సంసారసుఖమును అనుభవించుట మంచిది. ఆతనికి వివాహము చేయుము.”

నంటవాడు సమాధానము చెప్పెను:—

పెండ్లిచేసిన ఒకేరోజున ఊరేగింపు బయలుదేరును. సన్యా సము తీసికొనిన నాకుమారునకు రోజును ఊరేగింపులు ఉండును. స్వామివారు వెళ్ళినప్రతిచోటికి అనేకమంది భక్తులు చేరెదరు. ఆఊరే గింపులముందు ఈపెండ్లిఊరేగింపు ఎంత?

తరువాత ఆవంటవానికుమారుడు సన్యసించి దండ, కమండల ములను స్వీకరించెను.

కాని కొలదిరోజులలోనే గురువుగారు మరియొకశిష్యుని తన మఠమునకు అధిపతిని జేసిరి. అంతట ఆతనికి నిరాశకలిగి గురువుగారి వద్దకు వచ్చి చెప్పెను. "సమయమువచ్చినప్పుడు నేను ఒకటికాదు, పదిమఠములకు అధిపతిని అగుదును." ఇట్లు పలికి తనసామగ్రిలను తీసికొని దూరప్రదేశమునకు పోయి ఒకగ్రామమునకు బైట తప శ్శాలివలె డబాయించుకుని కూర్చొనెను. వచ్చుపోవువారు ఆతడు ఎవడో మహాతపశ్శాలి అనుకొని ఫలములు, పుష్పములు, పాలు మొదలగునవి తీసికొనివచ్చి ఇచ్చెడివారు. ఆతడు నిరాహారినని చెప్పుకొనుచు ఏమియును తీసికొనెడివాడుకాడు. అనుకొనినవిధముగా ఆతనిస్నేహితుడు రాత్రి ఎవరును లేనప్పుడు ఆహారమును తెచ్చి ఇచ్చెడివాడు. ఇదేవిధముగా తననిత్యక్రియలన్నియును ఎవరికిని తెలియకుండ నెరవేర్చుకొనెడివాడు.

గ్రామముబైట ఉన్న మహాతపశ్శాలి నిరాహారి అను విష యము అంతకంతకు బాగుగా వ్యాపించెను. ఈసంగతి తెలిసినకొల దియు జనులు గుంపులుగా ఆతనివద్దకు వచ్చెడివారు. ఆతడు తపస్సు చేయుచున్నట్లు నటించెడివాడు. ఇట్టి దాంభికతపశ్శాలురనుగురించి భగవానుడు గీతలో చెప్పెను:—

సత్కారమానపూజార్థం తపో దమ్భేన చైవ యత్ ।
క్రియతే తదిహ ప్రోక్తం రాజసం చలమధ్రువమ్.

"సత్కారము, మానము, పూజ పొందుటకు దంభముతో చేయు తపము రాజసతపము అని శిష్టులు చెప్పుదురు."

సారాసారవివేకములేకుండ అవివేకులు "ఈయన గొప్పతపో నిష్ఠుడు." "ఈయనతో సాటి మరిఎవరు? ఈయన శ్రేష్ఠుడు" మొద లగు శబ్దములతో స్తుతించుట సత్కారము.

గ్రుడ్డినమ్మకమువారు ఇట్టివానిని తపశ్శాలి అనుకొని లేచి నిలబడెదరు, స్వాగతము ఇచ్చెదరు, గౌరవించెదరు, నమస్కరించె

దరు, స్వాగతపత్రములను ఇచ్చి వారి గుణములను వర్ణించెదరు. స్తుతించెదరు. ఇది మానము.

అవివేకులు శాస్త్రజ్ఞానము లేని అటువంటి వ్యక్తికి పాదప్రక్షాళనము చేయుట, చరణోదకమును పానముచేయుట, పత్రపుష్పాదులచే షోడశోపచారపూజనము మొదలగునవిచేయుదురు. కానుకలను సమర్పించెదరు. హారతులు ఇచ్చెదరు. వారి ఆజ్ఞలప్రకారము సంచరించెదరు. ఇది పూజ.

ఇట్లు తపశ్శాలి అంతరంగమున మానప్రతిష్ఠాదుల కోరిక అపారముగా నున్నను అజ్ఞానులు ద్రవ్యాసులు అర్పణముచేసినప్పుడు పైపైన వైరాగ్యమును ప్రకటించుచు "మావంటి సన్యాసులు ద్రవ్యమును తీసికొనరాదు" అని చెప్పెను. శాస్త్రప్రమాణములను చూపి సన్యాసి ద్రవ్యమును పుచ్చుకొనిన పతితుడగుననియు, ద్రవ్యము నరకములోనికి త్రోసివేయుననియు చెప్పెడివాడు. ఇట్లు వైరాగ్యమును చూపుటచే ఆతనియందు ప్రజలకు శ్రద్ధ పెరిగిపోయెను. ఇంతలో చాతుర్మాస్యలు సమీపించెను. గ్రామస్థులు ఆతనిని ప్రార్థించిరి:—

"స్వామి! తాము చెట్టుక్రింద ఎండకులోనయి నివసించుచున్నారు. కాని ఇక చాతుర్మాస్యలు వచ్చుచున్నవి. మాపై కృపజూపి మాగ్రామములోనికి విచ్చేయుడు. తమకు ప్రత్యేకముగా ఒక గృహమును ఏర్పాటుచేయుదుము.

ఆమహాత్ముడు గ్రామములోనికి వచ్చుటకు ఇష్టపడలేదు. వారి కోరికప్రకారము గ్రామముబైట ఒక శిథిలగృహమున వారినివాసము ఏర్పరచుటకు నిశ్చయించబడెను. అంతట ప్రజలయందు కల కథాశ్రవణాభిలాషను చూచి ఆతడు తలచెను. సులభముగా జగత్ప్రసిద్ధిని పొందుటకు ఇది మంచిసాధనము. అయినను లోలోపల తనకు ఉన్నకోరికను పైకి ప్రకటించక జనులు కోరినప్పుడు దంభ

మును చూపుచు "అట్లు చేయను" అని చెప్పెడివాడు. ప్రజలు మిక్కిలి కోరినప్పుడు వారియందలి కృపచే వారికోరికను మన్నించెడివాడు. పైకి మాత్రము "న వ్యాఖ్యాముపయుఞ్జీత ।" అని చెప్పబడినది. మావంటి సన్యాసులు ప్రవచనము చేయరాదు. కాని మీ అందరకు వినవలెనను కోరిక ఉన్నందున లోకకళ్యాణార్థము చెప్పుచున్నాను అనెడివాడు. ఇట్లు కపటోపాయముతో కూర్చొనిన బ్రహ్మవేత్తలు చేసిన బ్రహ్మోపదేశములు వ్యర్థము. వారు స్వయముగా అజ్ఞానులేకదా! విద్వాంసులు అట్టివారిని కుక్కలతో పోల్చిరి.

*ఆబద్ధకృత్రిమసటాజటిలాంసభిత్తి*
*రారోపితో మృగపతేః పదవీం యది శ్వా ।*
*మత్తేభకుమ్భతటపాటనలమ్పటస్య*
*నాదం కరిష్యతి కథం హరిణాధిపస్య॥*

"సింహచర్మమును ధరించి కుక్క సింహమువలె కనపట్టినకనపట్ట వచ్చును. కాని మదోన్మత్తమగు గజముయొక్క కుంభస్థలమును బ్రద్దలుకొట్టు సింహముచేయు గర్జన ఎచ్చటనుంచి నేర్వగలదు?"

సింహచర్మమును ధరించిన కుక్కనుచూచి పిల్లలు సింహము అని తలచి భయపడెదరు. కాని తెలివికల ప్రౌఢులు అది కపటసింహము అని తెలిసికొని మామూలుకుక్కగనే గణించి తోలివేయుదురు. అటులనే దాంభికులగు ఉపదేశకులు బుద్ధిమంతులను మోసము చేయలేరు. చివరకు వారికపటభిక్షుకస్వరూపము బైటపడిపోవును.

ఆకపటసన్యాసి ఆచాతుర్మాస్యములలో గీతాప్రవచనముచేసి చాలమందిని ఆకర్షించెను. ఆయన కీర్తి చుట్టుప్రక్కలనున్న అనేక గ్రామములలో వ్యాపించెను. అయినను అంతటితో ఆతడు సంతోషించలేదు. ఒకవిద్వాంసునివలెకాక సిద్ధపురుషునివలె ప్రజలపూజలను పొందవలెననుకోరిక ఆతని హృదయమున ప్రబలెను. అంతట తరువాతిచాతుర్మాస్యమునందు ఆతడు ప్రజలతో నిట్లు చెప్పెను:—

ఇక నేను ప్రవచనాదిప్రవృత్తులను పొందను. వానిచే మావంటిసన్యాసులు పరబ్రహ్మధ్యానమును చేసికొనుటకు విక్షేపము కలుగును. ఇచ్చటకు కొలదిదూరమున ఉన్న పర్వతమునందలి ప్రాచీనగుహాయందు ఏకాంతవాసముచేసి ధ్యానయోగమును అనుష్ఠించెదను.

జనులు ఈమాటలువిని ఖేదమునుపొందిరి. భక్తితో స్వామి వారిని ప్రార్థించిరి:— ప్రభూ! తమకోరిక అట్లు ఉన్నచో మావలన తమధ్యానమునకు భంగము రానీయము. కాని మాఅందరియందును దయయుంచి ప్రతిరోజును మాకు దర్శనము ఇండు.

మనస్సులో సంతోషించుచు ఆగాంభీర్యుడగు తపశ్శాలి గాంభీర్యమును ప్రకటించుచు పలికెను:—

"సరే, మీఅందరికోరికప్రకారము నేను ప్రతిరోజును ఉదయము ఏడుగంటలనుండి ఎనిమిదిగంటలవరకు ఒకగంటమాత్రము గుహనుండి బైటకువచ్చెదను. అప్పుడు మీరు నాదర్శనము చేయవచ్చును. అటుతరువాత నేను ధ్యానమున లీనమగుదును. మహాత్ముడు తమయందు చూపిన కృపకు జనులు ఎంతయో సంతసించిరి. అప్పటినుండి ఆమహాత్మునిదర్శనమునకు నిత్యము వేలకొలదిజనులు వెళ్లుచుండిరి. మహాత్ముడు నిర్దిష్టసమయమునమాత్రమే దర్శనమిచ్చుననియు, మిగిలినరోజంతయును ధ్యానమునందు నిమగ్నులయెదరనియును వినిన జనులకు చాల ఉత్సాహము కలిగెను. గుహవైపు వెళ్లుత్రోవ అంతయు పూజాసామగ్రుల దుకాణములతో నిండిపోయెను. భావుకులగు జనులు స్వామివారికి ఏదియో ఒకటి సమర్పించి పరమపుణ్యాత్ములము అయితిమి అని అనుకొనెడివారు. ఆధూర్తమహాపురుషుడు బైటికి ఉపేక్షాభావమును వ్యక్తము చేయుచున్నను లోలోపల అనేకవిధములగు పూజలకొరకును, కీర్తిని పెంచుకొనుటకును ఆలో

చించెడివాడు. మనసునందలి వాసనలు పోనంతవరకు ధ్యానము ఎక్కడనుండి సిద్ధించును?

*కీర్తిపూజాభిమానార్తైః లోకయాత్రానురఞ్జితైః ।*
*బోధచక్షుర్విలుప్తం యైః తేషాం జ్ఞానే న యోగ్యతా॥*

"తనకీర్తి, ప్రతిష్ఠ, అభిమానము-వీనియందు ఆసక్తికలిగి చాలమంది తనదర్శనమునకు రావలెనినియు, అందరు తనను కొలువవలెననియు తలచి, అందు సంతోషమును పొందువాని జ్ఞానమునుకన్ను నశించును. ఆతనికి ధ్యానముచేయు యోగ్యతలేదు"

*లోకానురఞ్జకైః పాపైః కర్మభిర్గౌరవం శ్రితాః ।*
*అరఞ్జితనిజస్వాన్తా అక్షార్థగహనే రతాః॥*
*అనుద్ధృతమనశ్శల్యా అకృతాధ్యాత్మనిశ్చయాః ।*
*అభిన్నభావదుర్లేశ్యా నిషిద్ధా ధ్యానసాధనే ॥*

"జనులను సంతోషపరచు పాపకర్మలచే గొప్పతనమును పొందువారును, తమచిత్తమునకు ఆత్మయందు ప్రసన్నత కలుగజేయనివారును, ఇంద్రియవిషయములనెడు దుర్గమమార్గమున ఉన్నవారును, మనశ్శల్యమును తీసివేయనివారును, అధ్యాత్మనిశ్చయమును చేయనివారును, హృదయమునుండి దుర్భావములను బహిష్కరించనివారును ధ్యానముచేయ నర్హులుకారు."

*నర్మకౌతుక కౌటిల్యపాపసూత్రోపదేశకాః।*
*అజ్ఞానజ్వరజీర్ణాఙ్గామోహనిద్రాస్తచేతనాః॥*
*అనుద్యుక్తాస్తపః కర్తుం విషయగ్రాసలాలసాః।*
*ససంగాః శఙ్కితా భీతా మన్యేఽమీ దైవవఞ్చితాః॥*
*పతే తృణీకృతస్వార్థా ముక్తిశ్రీసంగనిఃస్పృహాః।*
*ప్రభవన్తి న సద్ధ్యానమన్వేషితుమపి క్షణమ్॥*

"హాస్యము, కౌతుకము, కుటిలత్వ, ముహింస మొదలగు పాప ములయందు ప్రివృత్తిని కలుగజేయుశాస్త్రములను బోధించువారును, అజ్ఞానజ్వరముచే బాధపడువారును, మోహానిద్రియందుండి బుద్ధిని కోల్పోయినవారును, తపమునందు సోమరులును, విషయలాలసులును, శంకాపరిగ్రిహసహితులును, వస్తునిశ్చయము చేయనివారును, భయ భీతులును, దురదృష్టవంతులు. వీరిదృష్టిలో తమహితము గడ్డిపోచ వలె హీనమయినది. వీరు మోక్షలక్ష్మీసమాగమమునకు విము ఖులు. పైవిధముగ ఆచరణకలక్షుద్రిలు ఒకక్షణమైనను ధ్యానము చేయలేరు.

ఇట్లు ప్రిజలను మోసపుచ్చుచున్న అధూర్తవిద్యాప్రవీణుడగు మహాత్ముని రెండవచాతుర్యమ్మకూడ గడచెను. అనంతరము ప్రిజలు వారిని తమనెలవుకురమ్మని బ్రితిమాలుకొనిరి.

"ప్రిభూ! ఈప్రిదేశము గ్రామమునకు దూరము. ఇచ్చటకు వచ్చుటకు ప్రిజలకు కష్టముగానున్నది. గ్రామవాసులమగు మా యందు దయయుంచి గ్రామముబైట ఒక చిన్నకుటీరమును నిర్మించు కొని ఉండుడు.

ఆమహాత్ముడు గొప్పకు "మాకు ఇంటితో పనియేమి!" అని ప్రశ్నించెను.

## సన్యాసికి గృహాదులు నిషిద్ధములు.

భాగవతము "*గృహం శరీరం మానుష్యమ్*" అని చెప్పబడినది. ఈమనుష్యశరీరమే గృహము. దత్తాత్రేయులవారు 24 గురువులలోను సర్పమునుకూడ గురువుగా భావించిరి.

*గృహారమ్భో హి దుఃఖాయ విఫలశ్చాధ్రువాత్మనః ।*
*సర్పః పరకృతం వేశ్మ ప్రవిశ్య సుఖమేధతే॥*

"అనిత్యమగు ఈశరీరమునకు గృహాదులను నిర్మించవలెనని కోరుట నిష్ఫలము. ఎలుకలు మొదలగు ఇతరజీవులు నిర్మించిన బిలమున ప్రవేశించి సర్పము సుఖముగ జీవించును."

ఇతరులు నిర్మించిన శిథిలగృహము ఏదైన ఉన్నయెడల సన్యాసి అందు ఉండవచ్చును అని శాస్త్రజ్ఞుల అభిప్రాయము. అది కూడ వర్షకాలమునందును, శీతకాలమునందునుమాత్రమే. వేసవికాలమునందు ఏదో ఒక చెట్టుక్రింద పడిఉండవలెను. ఈవిషయమున లోమశమహాముని దృష్టాంతమును వినుడు:—

లోమశమహార్షియొక్క ఆయుర్దాయము సుదీర్ఘమైనది. ఆయన ఒక గడ్డిచాప తయారుచేసికొని సూర్యుని ఎండ తనపైబడకుండుటకు ఉదయమున తూర్పువైపున ఉంచెడివాడు. ఎండనుబట్టి ఆచాపను మార్చెడివాడు. సాయంకాలమునకు ఆచాపను పశ్చిమమున ఉంచెడివాడు. వారిదర్శనము చాలకష్టము. ఒకానొకప్పుడు కృష్ణపరమాత్ముడు అర్జునునితో ఆయనదర్శనమునకు వెళ్ళెను. ప్రసంగవశమున కృష్ణుడు ఇట్లనెను:—

"ఈగడ్డిచాపకంటె ఒక చిన్నకుటీరమును నిర్మించుకొని మీరు అందుండిన మంచిది."

లోమశ:— ఈఅనిత్యశరీరము కొలదికాలములో క్షయమును పొందును. దీనికొరకు నేను కుటీరము తయారుచేయు జంజాటములో ఏలపడవలెను?

త్యాగులచరిత్ర ఈవిధముగ ఉండును.

## దంభముచే ధర్మము చెడును.

"వృక్షముక్రిందకాని, శూన్యప్రదేశమునందుకాని ఉండుట మాధర్మము" అని ఆకపటసన్యాసి కుటీరమును నిర్మించనివ్వలేదు. తనవాదమును బలపరచుకొనుటకు సైతాను శాస్త్రవచనములను

సంపాదించగలడు (Devil Quoting scriptures.) అని ఇంగ్లీషులో చెప్పబడినదిఅక్షరాల నిజము.

కాని జనులు వారిని పట్టుబట్టిరి:- ప్రభూ! తమకు అన్నిప్రదేశములును సమానములే. కాని చాతుర్మాస్యలలో దర్శనముచేయుటకు వచ్చినవారు శ్రమపడుచున్నారు. మాయందు దయయుంచి గ్రామములోనికి దయచేయుడు.

అంతట ఆతడుచెప్పెను:— "నేను గ్రామములోనికి రాను. అందమగు ఇంటిలోనుండుట మాఆశ్రమధర్మము కాదు. గ్రామము దగ్గర ఎవరును ఉండనిమందిరముకాని ఏకాంతప్రదేశముకాని ఉన్నచో అచ్చటకు వచ్చెదను.

అంతట జనులు అచ్చటనున్న ఒకపాడుపడిన ఇంటిలో ఆసన్యాసికి ఏర్పాట్లుచేసిరి. ఆతడు అందు నివసించ మొదలిడెను.

## ధర్మభంగముతోపాటు వ్రతభంగము.

చాతుర్మాస్యలయందు కూడా ఉండువారందరు ఆతనిసేవకులైరి. వారందరును విన్నవించిరి. "ప్రభుకథాశ్రవణమునకు వచ్చు జనులకు కూర్చొనుటకు చాలబాగుగానున్నది, ఎవరితోనుసంబంధములేని ఒక మఠమునునిర్మించిన బాగుండును.సర్పమువలె ఇతరులునిర్మించిన ఆశ్రయమున సన్యాసి నివసించవలెనని తమరే సెలవిచ్చిరికదా! మేముఅందరమునుకలసి మఠమును నిర్మించెదము. పిదప తాము దానియందు వేంచేయుడు. శ్రద్ధాభక్తి సమన్వితులగు జనులు అచ్చటకువచ్చి కథాశ్రవణము చేయుదురు. కొంచెము విశ్రాంతికూడ తీసికొనెదరు. ఇదంతయు జనకళ్యాణము కొరకే. ఇందు తమకు ఇచ్చునదికాని, తీసుకొనునదికాని లేదు. ఇది తమకు ఉపాధిగా పరిణమించదు."

ఆతడు పలికెను— సరే, మీ యిష్టము.

అంతటితో ఒకపెద్దమఠము నిర్మించబడెను. సన్యాసి అందు నివసించెను. తరువాత క్రమక్రమముగా జాగీర్లు, గుర్రములు, బండ్లు,

మొదలగునవికూడ వచ్చెను. ఆయనవద్ద పదిపదిహేనుమంది సన్యాసము తీసుకొనిన శిష్యులుకూడ బయలుదేరిరి.

## కలికాలపు తత్త్వవేత్తలు.

కలియుగమునందలి తత్త్వవేత్తలనుగురించి సౌరపురాణమున వ్యాసభగవానుడు ఇట్లు చెప్పెను.

మఠాధిపత్యం సేవా చ ధనసంగ్రహ ఏవ చ ।
దాసీగమనమీర్ష్యా చ షడ్విధా తత్త్వవాదినః॥

"మఠాధిపత్యము, సేవ, ధనసంపాదన, దాసీగమనము, ఈర్ష్య, ఈ ౬ గుణములు కలవారును కలియుగమునందలి అజ్ఞానులచే తత్త్వవేత్తలనబడుదురు."

"మేము మఠములను నిర్మించుట లోకకళ్యాణముకొరకు. సంసారులు మఠములోనికి వచ్చి సంసారదుఃఖములనుండి విముక్తిని పొందుటకు ప్రభువును స్మరించెదరు. సన్యాసులకుకూడ భిక్ష, నిలచుటకు నీడ ఉండును. కావున మఠములను నిర్మించుట మాధర్మము." అని మఠనిర్మాణమును ఈతత్త్వవేత్తలు సమర్థించెదరు. మఠాధిపతులైన పిమ్మట సేవకులకుకూడ అనేకవిధములగు గృహాదులను నిర్మింపచేయుదురు. ఏకాదశి, శివరాత్రి, గురుపూర్ణిమ మొదలగు పర్వాదివసములయందు శిష్యులను పిలచెదరు. వారినుండి వీలగుసేవలను పొందెదరు. పిమ్మట శిష్యులు జనులను మోసపుచ్చి, పాఠశాల, గోశాల, అన్నసత్రము మొదలగు వంకలతోధనముసంపాదించెదరు. ఆధనముతో ఆదాయమునిచ్చు భూములు, జాగీర్లు, అద్దెనిచ్చు భవనములు మొదలగునవి కొనెదరు. ఇట్లు ధనసంగ్రహముచేయుటతో ఇట్టి ఐశ్వర్యమునందు ఆసక్తి కలుగును. తనకంటె ఏసన్యాసైన ఎక్కువ ఐశ్వర్యమునుకాని, గౌరవమునుకాని పొందుచున్నచో ఆతనియందు ఈర్ష్య కలుగును. ఆతనికంటె ఎక్కువ ఐశ్వర్యమును, గౌరవప్రతిష

లను పొందుటకును, అగౌరవప్రతిష్ఠలుకలవానికి అగౌరవము కలుగుటకును వలయు ఉపాయములను ఆలోచించెదరు. ఇట్టిపతితులగు సన్న్యాసులు తమోగుణవిశిష్టులు.

"అధర్మం ధర్మమితి యే మన్యన్తే తమసావృతాః" అని గీతలో చెప్పినట్లు అధర్మమును ధర్మముగ భావించుచు తమోగుణప్రధానులగు ప్రాకృతజనులు వారు మహాతత్త్వవేత్తలు అనుకొనెదరు. ఆసన్న్యాసికి తమధనాదులు అర్పితముచేసి తాము కృతకృత్యులమయితిమి అనుకొనెదరు. వారు తమ సేవలను స్వీకరించుట తమభాగ్యమను కొనెదరు. ఎంతయో శ్రమపడిసంపాదించబడిన ధనము సద్వ్యయమయ్యెనని సంతోషించెదరు.

వ్యాసభగవానుడు సౌరపురాణమున చెప్పెను:—

జాతమాత్రం నరం కంచిత్ ముణ్డయిత్వా మఠాధిపమ్ ।
కాషాయవస్త్రమాత్రేణ కరిష్యన్తి నరాధమాః॥

అప్పటికప్పుడు పుట్టినమనుష్యుని ఆతనిశీలాదులను పరీక్షించకుండనే, ముండనముచేసి కాషాయవస్త్రమును ధరింపజేసి నరాధములగు కలికాలపు సన్న్యాసులు మఠాధిపతినిగ చేయుదురు.

తులసీరామాయణమున కలియుగపు సన్న్యాసులనుగురించి కాకభుశుండి గరుడునితో చెప్పెను.

సన్న్యాసులు మహాధనవంతులయి పెద్దపెద్ద భవనములను కట్టించెదరు. వారు వైరాగ్యమును హరింతురు. తపశ్శాలురు ధనవంతులగుదురు. గృహస్థులు దరిద్రులగుదురు. కలియుగమునందలి కౌతుకము వర్ణించనలవికాదు.

## వ్రతభంగము.

అనంతరము గీతాప్రవచనము ఆరంభమయ్యెను. ఈవిధముగా నాలుగుదిశలకును, దేశదేశాంతరములకును స్వామివారి ప్రసిద్ధి

వ్యాపించెను. ఇతరగ్రామములనుండి జనులు వారిదర్శనమునకు వచ్చి తమగ్రామమునకు దయచేసి మాగ్రామమును పావనముచేయుడని ప్రార్థించిరి. ఇతరగ్రామములయందు తాను పూజించబడవచ్చునని ఆసన్యాసి అందుకు అంగీకరించెను. వారిసూచనప్రకారము శిష్యులు ఆగ్రామస్థులకు ఇట్లు చెప్పిరి. గురువుగారు మీగ్రామమునకు వచ్చెదరు. మీరు వెళ్ళి వారిస్వాగతమునకు వలయు ఏర్పాట్లు చేయుడు. గ్రామమును తోరణములతోను, జండాలతోను అలంకరించుట, గురువుగారిని గౌరవించుట మనధర్మము. ఈఏర్పాట్లు చేయించి ఆతడు అచ్చటకువెళ్ళుచు గొప్పఊరేగింపు లేవదీసెను. స్వాగతపు ఊరేగింపులో బాజాలు ముందు వానితరువాత అనేకమందిశిష్యులు సేవకులు వరుసలో నడచిరి. వారితరువాత, రెండుగుర్రములబండిలో గురువుగారు; వారి అందరివెనుక అనేకమంది స్త్రీలు, గుంపులు గుంపులుగా పాటలు పాడుచు నడచిరి. ఇట్లు ఎంతోగౌరవముగా ఆతడు ఆగ్రామము ప్రవేశించెను. తరువాత శిష్యులద్వారా కానుకలు ఇచ్చుపద్ధతి తెలియజేసెను. జనులు వారి ఆజ్ఞలను పాలించిరి. కాని కొందరు బీదలు తమశక్తి ననుసరించి కానుకలు తెచ్చిరి. అదిచూచి గురువుగారు ఇట్లనిరి. తమకళ్యాణమును కోరునరులు గురువునకు సేవచేయుటయందు ధనాదులను వ్యయమునుచేయుటకు ఏమాత్రమును వెనుదీయరు. ఈధనమును గురువుగారు తమకొరకు వినియోగించరు. సాధువులకును, సన్యాసులకును భోజనము పెట్టుటకును, గోశాలలు, పాఠశాలలు మొదలగునవి నిర్మించుటకును మాత్రమే ఉపయోగించెదరు. ఈవిధముగా మీఐశ్వర్యము ఖర్చుఅగును. కావున నిశ్శంకగా ధర్మార్థము విత్తశాఠ్యమును చూపకుండ ద్రవ్యమును అర్పించవలెను.

ఈవిషయమున శివపురాణమున చెప్పబడినది.

*విత్తశాఠ్యం న కుర్వీత యదీచ్ఛేత్పరమాం గతిమ్ ।*

"పరమగతిని పొందగోరువారు విత్తశాఠ్యమును కలిగియుండ రాదు." ఇట్టిఉపదేశములచే ప్రేరేపించి జనులద్వారా నానావిధ సామగ్రిలను సంపాదించెను. అవి స్వీకరించి ఆతడు తనగ్రామమునకు తిరిగి వెళ్ళుటకు తయారయ్యెను. గ్రామస్థులు కొలదికాలము ఆగి తమను ఉపదేశములతో తరింపజేయుడని ఆతనిని ప్రార్థించిరి. శ్రోత్రియులును, బ్రహ్మనిష్ఠులును అగు గురుశ్రీవారు దయచేసి ఒక మాసము ఆగుటకు నిశ్చయించిరి. "ప్రతిదినము ఉదయము 8 గంటల నుండి 9 గంటలవరకును, సాయంకాలము 6 గంటలనుండి 7 గంటల వరకును బ్రహ్మవిద్యాప్రవచనము జరుగును. అందరును దయచేసి అమృతవాక్కులను విని ధన్యులుకండు" అని దండోరా వేయించిరి. దానితోపాటు "పూజ్యశ్రీచరణదర్శనసౌభాగ్యముకూడ లభించును. ఇట్టి సదవకాశము మాటిమాటికి దొరకదు." అనికూడా చాటించిరి. ఉదయమున సాయంకాలమున, ప్రవచనము జరిగెడిది. స్వామివారు శిష్యులద్వారా తెలిపిరి. "మీభక్తి స్వామివారికి ఇబ్బందిఅయినను ఇచ్చట ఆపినది. సరియగు భవనములేనందున గురువుగారికి కష్టముగా నున్నది."

గ్రామవాసులు ఇట్లనిరి:— "అయిన వారికి సముపాయముగా నుండుటకు ఒకభవనమును నిర్మించెదము. గురువుగారు తరుచువచ్చుటకు వీలుపడును."

ఈవిధముగ అచ్చట ఒకమఠము నిర్మించబడెను. అటులనే ఆయన వెళ్ళిన ప్రతిప్రదేశమునను మఠములు నిర్మించబడెను. తరువాత తనవద్ద శాస్త్రమును అభ్యసించిన శిష్యులను మఠాధిపతులనుగా అచ్చట నియమించెను. శిష్యులుకూడ ఉదయసాయంకాలములందు ఉపన్యాసములు ఇచ్చి,పరదేశములకు వెళ్ళి ప్రవచనములు చేసి ధనమును పుష్కలముగా సంపాదించిరి. ఈవిధముగా కొలది

కాలముననే ఆతడు మహాసమృద్ధిమంతుడయ్యెను. కాశీ, ప్రయాగ మొదలగు పుణ్యక్షేత్రములయందుకూడ పది, పదిహేను మఠములను కట్టించి తనప్రతిష్ఠను పూర్తి చేసికొనెను. ఈశిష్యులును, సేవకులును ఎల్లరును గురువుగారిని ఎంతయో గౌరవించుచుండిరి. అజ్ఞానుల ద్వారా లభించిన ఈగౌరవముచే ఆతనికి మదము వృద్ధిపొందెను. అంతట ఆతడు "శ్రీమత్ పరమహంసపరివ్రాజకాచార్య 108, బ్రహ్మ విద్వరిష్ఠ" అను బిరుదమును స్వీకరించెను.

## మదాంధుని ప్రవర్తన.

గురుశ్రీవారు వెళ్ళినప్రతిచోటికి వారికొరకు ప్రత్యేకముగా నిర్మించబడిన సువర్ణపీఠమును తీసికొనివెళ్లెడివారు. దానిపైకూర్చొని వారు ఉపన్యసించెడివారు. పొరబాటున ఏజ్ఞానిఅయినను, సన్యాసి అయినను వారి దర్శనమునకు వచ్చిన తాను మఠాధిపతిననియును, సమృద్ధిమంతుడగు ఆచార్యుడను అనియును అనుకొని, ఆవచ్చినవాడు తుచ్ఛుడగు భిక్షుకుడని భావించి తాను పీఠముపైననే కూర్చొనెడివాడు. వచ్చినవానిని క్రిందకూర్చుండబెట్టెడివాడు. ఎక్కువ చాతుర్మాస్యలు చేసినవాడును, విద్వాంసుడును, వైరాగ్యవంతుడును అయినను శంఖముద్రాదులతో సహితముగా ఆతని నమస్కారములను పొందెడివాడు. గృహస్థుడెవడైన నిలబడి నమస్కరించిన, ఇది మూర్ఖనమస్కారము అని పలికి సాష్టాంగనమస్కారము చేయించుకొనెడివాడు. తాను ఎవరికిని నమస్కరించెడివాడు కాడు. ఒకనాడు ఒక అవధూత అచ్చటికి వచ్చి ఇదంతయును చూచుచు నిలబడియుండెను.

శిష్యులు ఆతనితో నిట్లనిరి:— "వచ్చినవాడవు అట్లు జడపదార్థమువలె కదలక నిలబడియున్నావేమి? భగవత్స్వరూపులగు ఆచార్యులవారికి నమస్కరించుము."

అవధూత:— ఈతడు సర్వవిధముల పతితుడు. ఇతనిని చూచినందున నేను ప్రేతస్నానము చేయవలెను. ఇతనికి నమస్కారము చేయుటకూడనా?

శిష్యులు:— పూజ్యపాదుల శ్రీసమృద్ధులను చూచి నీకు అసూయ కలిగినది.

ఇదివిని అవధూత నవ్వెను:— "కుక్క కక్కిన కూడును తినును. అదిచూచి అసూయపడువాడు ఎవడు? వీరందరు కక్కిన కూడును తినువారు."

అంతట ఇతరశిష్యులు పలికిరి:— "నీవు సన్యాసిని నిందించుచున్నావా?"

అవధూత:— ఈజగమున సన్యాసియగువాడు నిందింపబడడు. ఇటువంటివారు వైరాగ్యములేకుండ వేషముమాత్రము వేసికొని నింద్యకార్యములను ఆచరించి నిందితులగుదురు. ఇంతియేకాదు. ఇట్టివారు యమదండన పాల్పడుదురు.

ఇట్లని అవధూత వెళ్లిపోయెను.

శుకనీతి చెప్పుచున్నది:—

మానమత్తో మన్యతే స్మ తృణవచ్చాఖిలం జగత్ ।
అనర్హో౽పి చ సర్వేభ్యః పాద్యార్ఘ్యాసనమిచ్ఛతి ॥

"మానమత్తులు మానవప్రపంచము తృణమువంటిది అని అనుకొనెదరు. అర్హతలేకపోయినను అందరివద్దనుండియు అర్ఘ్య, పాద్య, ఆసనాదిపూజలను కాంక్షించెదరు."

ఇట్లు ఆ మదాంధుడు సత్పురుషులను అవమానించెడివాడు. ధనవంతులెవరైన వచ్చినచో వారిని దగ్గరకూర్చుండబెట్టుకొని ప్రేమతో కుశలప్రశ్నలను అడిగెడివాడు, వారిని ఆదరించెడివాడు,

## అసురసంపద

జగమునందలి ఇట్టి అసురసంపచ్ఛాలురనుచూచి శ్రీధరస్వామి అను మహాపురుషుడు తనపై నిడికొని ఇట్టివారిని వర్ణించెను:—

దమ్భన్యాసమిషేణ వఞ్చితజనం భోగైకచిన్తాతురం
సంముహ్యన్తమహర్నిశం విరచితోద్యోగక్లమైరాకులమ్,
ఆజ్ఞాలఙ్ఘినమజ్ఞమజ్ఞజనతాసమ్మాననాత్సంమదం
దీనం నాథ దయానిధాన పరమానన్ద ప్రభో పాహి మామ్॥

"నేను కపటసన్న్యాసము అను మిషతో జనులను మోసము చేయుచున్నాను. విషయభోగములను మాత్రమే చింతించుచు తహతహలాడుచున్నాను. లభించిన వస్తువులయందలి మోహముతో ఒడలు తెలియకుండ ఉన్నాను. శ్రుతిస్మృతుల ఆజ్ఞలను ఉల్లంఘించుచున్నాను. అజ్ఞాని జనులుచూపు గౌరవముచే మదోన్మత్తుడనయితిని. నీవు దీనజనపరిపాలకుడవు. కృపాసముద్రుడవు. పరమానందస్వరూపుడవు. ఓపరమాత్మా! పైనచెప్పిన నరకమూలములగు పాపకృత్యములనుండి నన్ను రక్షించుము."

డా॥ లల్లూ:— ఈనాడు విధివిహితముగా కాషాయ దండాదులను ధరించువారిని సన్న్యాసులు అనవచ్చునా? అనరాదా?

స్వా ప్ర:—వైరాగ్యములేని సన్న్యాసము విధివిహితము అయినను సన్న్యాసము కాదు.

సత్కారమానపూజార్థం దణ్డకాషాయధారీ యః ।
స సన్న్యాసీ న వక్తవ్యః సన్న్యాసీ జ్ఞానతత్పరః॥

"సత్కారము, మానము, పూజ పొందుటకు దండమును, కాషాయమును ధరించినవాడు సన్న్యాసి అనబడడు. జ్ఞానతత్పరుడే సన్న్యాసి అనబడును."

ఈవిషయమున తుకారామునిగారి వాక్యములుకూడ గమనించదగినవి:—

"ప్రపంచమున గౌరవమును పొందుటకే నీవు సన్యాసివి అయితివి. అందుకొరకే గ్రంథములనుచదివితివి. అందుచే అసలురహస్యము నీకు తెలియలేదు. నీచిత్తమునందు పశ్చాత్తాపమునకు తావులేదు. నీవు పైపైన కాషాయములను ధరించితివి. నీవు అసత్యప్రసంగములు చేసి నీజిహ్వను శ్రమింపజేయుచున్నావు.

ఈజన్మమునందు భగవానుని పొందవలెననియే సన్యాసము తీసికొనవలెను. సన్యసించినతరువాత ఏకాంతమున కూర్చొని బ్రహ్మవిద్యాభ్యాసమున నిమగ్నుడవవలెను. జ్ఞానము కలిగినతరువాత నిర్ద్వంద్వుడయి శుక, వామదేవాదులవలె సంచరించవలెను."

"కామమాశ్రిత్యదుష్పూరమ్।" అని గీతలో చెప్పినట్లు ఒక కోరికనుండి వేరొకకోరికకు వెంబడించి అసురగుణములగు దంభమానాదులకు వశీభూతుడగును.

## కామత్యాగముచే బ్రహ్మసిద్ధి.

స్వా. నిత్యా. :—నిజము. కామత్యాగము చేయునంతవరకు ఎవరికిని సిద్ధి కలుగదు. ఆత్మపురాణమునందలి కథ వినుడు. దేవతలు దధ్యఙ్ఋషిదగ్గరకు వెళ్ళి తమకు ఇంద్రుని జయించవలెనని కోరిక కలదని చెప్పిరి.

వారికి దధ్యఙ్ఋషి ఇట్లు చెప్పెను:-

"మీరు శత్రువులను అందరిని జయించగలరు. కాని కామము అను ఆంతరంగిక శత్రువును జయించుశక్తి మీకు లేదు. సర్వదేవతలకును పూజ్యుడగు ఇంద్రుని జయించవలెననుకోరిక మీకు కలిగినది. ఆకామమునకు మీరు లోబడితిరి. కామములేనిదే నిషిద్ధకర్మమునందు బుద్ధిమంతుడు ప్రవర్తించడు. పూర్వము మీకు ఇంద్రుని జయించవలెనను కోరిక లేదు. ఇప్పుడు కలిగినది. కావున కామము మీప్రబలశత్రువు మీరు పూర్వజన్మమున కామక్రోధాదిరాజులను, ఇంద్రియములను కింకరులను జయించిరి. అందుచే మీకు దేవశరీరములు

వచ్చినవి. దేవసభలో ఇంద్రుడు తన వాగ్బాణములచే మిమ్ము హింసించెను. కావుననే ఇట్టికోరిక కలిగినది. ఈకామము అనుశత్రువునకు లోబడితిరి. కామికి ఎల్లచోటులయందును నిరాదరణ కలుగును. ఇంద్రుడు పూర్వముకాని, ఇప్పుడుకాని మిమ్ముఎందుకు నిందించెను అనునది మీరు ఆలోచించుటలేదు. మీయందు కామము లేనంతవరకు ఇంద్రుడు మిమ్ము గౌరవించెను. మీకు కామము కలిగినవెంటనే ఇంద్రుడు మిమ్మునిందించెను. కామమును జయించుసామర్థ్యము మీకు లేదు. ఇక ఇంద్రుని ఎటు జయించగలరు? కామము అను శత్రువు దేవతల సభలో మిమ్ము అగౌరవపరచెను. ఆశత్రువును జయించలేనిమీరు ఇంద్రుని ఎటు జయించగలరు! మొదట కామము అను శత్రువు మిమ్ము అవమానించెను. ఇప్పుడు ఆతనికికుమారుడగు క్రోధముకూడ తోడుకలదు. ఆతడు మీకు చేయలేని అపకారము ఏది కలదు? కామక్రోధములను పరమశత్రువులను ఉపేక్షించి బాహ్యశత్రువులగు రాజులను జయించదలచు జీవి పరమ మూర్ఖుడు."

మహాదేవుడుకూడ కామమును త్యజించెను. ఒకప్పుడు ఆయన గంగాతీరమున ఉగ్రతపము చేయుచుండగా దేవతలు చూచి కంగారుపడిరి. ఈతపమునకు కలుగు పర్యవసానము ఏమి? దేవతలు పట్టుబట్టి కామునిచే శంకరుని తపమునకు విఘ్నము కలిగించదలచిరి. ఇదిచూచి కామునిభార్య శంకరునికుమార్తెయగు రతిదేవి ఇట్లు పలికెను. "నా తండ్రిగారు సామాన్యులు కారు. మీరు నశించెదరు." అట్లు చెప్పినను ఒప్పుకొనక కాముడు పుష్పబాణము అను మోహాస్త్రమును శంకరునిపై ప్రయోగించెను. శంకరుడు తన తృతీయ నేత్రమును తెరచి చూచెను. అంతట కాముడు భస్మమయ్యెను.

శంకరుడు యోగాభ్యాసముచే జ్ఞానముద్వారా కామములను అన్నిటిని నశింపజేసెను. అటుతరువాత ఆయనకు బ్రహ్మస్థితి కలి

గెను. పురాణములయందుకల ఈకథకు అంతరార్థము ఇదియే. కామ రహితుడు అయినమీదట బ్రహ్మానుభవము కలుగును. ఈవిషయమున శ్రుతిని గమనించుడు:—

యదా సర్వే ప్రముచ్యన్తే కామా యేఽస్య హృది స్థితాః।
అథ మర్త్యోఽమృతో భవత్యత్ర బ్రహ్మ సమశ్నుతే॥

"ముముక్షువుని హృదయమునందలి కామములు నివృత్తిని పొందినప్పుడే అతడు జ్ఞాని అగును. మోక్షమును పొంది ఈశరీరమునందే బ్రహ్మానుభవమును పొందును."

## కామమును నశింపజేయు ఉపాయము.

డా. లల్లూ:— కామములను జయించు ఉపాయమేమి?

స్వా. ప్ర. :— అవేక్ష్య విషయే దోషం బుద్ధియుక్తో విచక్షణః।
కామపాశేన యో ముక్తః స ముక్తేః పథి గోచరః॥

"బుద్ధిమంతుడును, విచక్షణాపరుడును అగువాడు విషయములయందు దోషములను చూచి కామపాశమునుండి ముక్తుడగును. అతడే ముక్తిమార్గమును చూడగలడు."

పదార్థములయందు రమణీయబుద్ధి యున్నంతకాలము కామములనబడు వందలకొలది పాశములచే బద్ధుడగును. అది నశించి పదార్థములయందు దోషదృష్టి కలిగినచో కామములనుండి ముక్తుడగును. అతడు ముక్తిమార్గమున ముందుకు వెళ్ళగలడు.

శంకరాచార్యులవాక్యములు పరికించుడు.

## పదార్థములయందలి రమణీయబుద్ధిని త్యజించుట

శ్రుతే దృష్టేఽపి వా భోగ్యే యస్మిన్ కస్మింశ్చ వస్తుని।
సమీచీనత్వధీత్యాగాత్ కామో నోదేతి కర్హిచిత్॥

"వినినట్టికాని, చూచినట్టికాని భోగ్యపదార్థమునందు "ఈవస్తువు మంచిది." అను రమణీయబుద్ధిని త్యజించినచో కామములుకలుగవు."

ఉదాహరణకు ఒక స్త్రీని తీసికొనుడు. ఆమె కురూపి అయినను ముక్కు, కళ్లు సరిగా లేక మహాభయంకరముగానున్నను అందమైన బట్టలు కట్టుకొని, రత్నఖచితభూషణములు ధరించి, ముఖమునకు సౌందర్యప్రసాధకములగు వస్తువులను పూసుకొన్నచో ఆమె భయంకరత్వము కానరాదు. ఆమె యువకులగు కాముకులను ఆకర్షించును. కాని ఆమె వికరాళస్వరూపమును చూచినవాడుమాత్రము ఆమెకులోబడడు. అటులనే మాయకూడ మహాభయంకరస్వరూపిణి. కాని ఆమె తనవివిధములగు సుందరకార్యములద్వారా జనులను మోహములో ముంచివేయును. ఆమెయొక్క యథార్థమగు భయంకర స్వరూపమును చూచిన వ్యక్తులు ఆమాయికపదార్థములయందు అనురక్తిని పొందరు. అజ్ఞానములో నున్నంతకాలము మాత్రమే ఆమాయికపదార్థములయందు రమణీయబుద్ధిని పొంది వానిని కోరుదురు. జ్ఞానము కలిగినవెంటనే మాయికపదార్థములయందు రమణీయబుద్ధి కలుగదు. నరుడు వానిని కోరడు. కామనాశనమునకు ఉపాయములను శంకరులు ఇట్లు వర్ణించిరి:-

## విషయపదార్థములు అనర్థమును కలుగజేయును అను యథార్థపరిజ్ఞానము.

యథార్థదర్శనం వస్తున్యనర్థస్యాపి చిన్తనమ్
సంకల్పస్యాపి కామస్య తద్వధోపాయ ఇష్యతే॥

"మాయికపదార్థముల యథార్థమును తెలిసికొనుట, వానిచే కలుగు అనర్థములను గురించి విచారించుట- ఇవియే కామములను వధించు ఉపాయములు."

ఒక రాజువద్దకు ఒకవ్యక్తి బంగారుపళ్ళెములో అత్యంతసుందరముగా కన్పించు బంగారురేకులలో విషమిశ్రితములగు మిఠాయిలు మొదలగు ఖాద్యపదార్థములను పంపెననుకొనుడు. "ఇవి శత్రుప్ర

పంపినవి. వీనిచే అనర్థము మృత్యువు కలుగును" అని రాజు తల చును. అది యథార్థమో కాదో తెలిసికొనుటకు కుక్కలచే వాటిని తినిపించును. వెంటనే కుక్కలు చనిపోవును. ఇట్లు ఆపదార్థములు విషమిశ్రితములు అని గ్రహించినచో వానిని తినవలెనను కోరిక కాని, సంకల్పము కాని రాజుకు కలుగదు. ఇదేవిధముగ పైకి సుందరముగ కనఁబడు నాయికపదార్థములు పరిణామమున అనర్థమును కలుగ జేయును అని తలచువాడు సంకల్పములను, కామములను నశింపు జేయసమర్థుడగును.

## శాస్త్రవిధినిషేధములను అనుసరించి ప్రవర్తించవలెను.

సంకల్పముచే కామము జన్మించును. కామప్రాప్తికి శాస్త్ర మర్యాదలను ఉల్లంఘించి వ్యక్తి ఇష్టమువచ్చినట్లు సంచరించును. శాస్త్రానుసారము సంచరించనంతవరకు వ్యక్తికి సిద్ధి కలుగదు. సుఖము కలుగదు. పరమగతి కలుగదు. గీత 16వ అధ్యాయము చివర భగవానుడు చెప్పెను:—

*యః శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః।*
*న స సిద్ధిమవాప్నోతి న సుఖం నపరాం గతిమ్॥*

"శాస్త్రవిధిని పరిత్యజించి తనఇష్టమువచ్చినట్లు సంచరించు వాడు యోగసిద్ధిని పొందలేడు. బ్రహ్మసుఖమును పొందలేడు. విదేహముక్తి అను పరమగతిని పొందలేడు."

అధికారియగు నరునకు అపూర్వార్థమును బోధించునది శాస్త్రము. అధికారి శ్రేయస్సుకొరకే శాస్త్రములు నిర్మించబడెను. చతుర్వేదములు, సూత్రములు, స్మృతులు, పురాణములు, ఇతిహాస ములు మొదలగునవి శాస్త్రములు.

ఈ శాస్త్రములయందు ఈపనిచేయవలెను, ఈపనిచేయరాదు అని విధినిషేధవాక్యములు ఉండును. ఈవిధినిషేధవాక్యములు

కర్తవ్య అకర్తవ్యజ్ఞానమునకు హేతుభూతములయి ప్రవర్తకములుగను, నివర్తకములుగను ఉండును. విధులను పాలించుటచే అధికారికి శ్రేయస్సు కలుగును. దేనిని ఆచరించుటచే తాను పతితుడగునో వానికి దూరముగా నుండుటకు శాస్త్రములయందు నిషేధవాక్యములు కలవు. శాస్త్రాభ్యాసముచేసి తదనుసారము ప్రవర్తించువాడే తన చిత్తనిగ్రహమును సాధించి కామములను జయించగలడు. అట్లు చేయలేనివాడు శాస్త్రవిధులను ఉల్లంఘించి స్వేచ్ఛాప్రవర్తనను పొందును. అట్టివానికి యోగసిద్ధి కలుగదు. ఉదాహరణకు అంతఃకరణశుద్ధికి శాస్త్రములయందు విధించబడిన నిష్కామకర్మను ఆచరించనిచో అంతఃకరణశుద్ధిని పొందలేము. ఉపాసనాదులు ఆచరించనివాడు విక్షేపదోషమును నివారించలేడు.

కావున శాస్త్రవచనములయందు శ్రద్ధకలిగి, కామములను నిషేధించి, శాస్త్రానుసారము ప్రవర్తించవలెను. వస్తుస్థితి ఇట్లుండుటచేతనే తరువాతిశ్లోకమున కృష్ణభగవానుడు కార్యాకార్యనిర్ణయమునందు శాస్త్రవిధినే ప్రమాణముగా తీసికొని ఆవిధముగా సంచరించుము అని చెప్పెను.

తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ।
జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తుమిహార్హసి॥

కామనాప్రేరితులయి స్వేచ్ఛాప్రవర్తనను కలిగియున్నవారు సిద్ధిని, బ్రహ్మసుఖమును పొందలేరు. శాస్త్రోక్తములగు విధినిషేధములను అనుసరించి తన కార్యాకార్యములను నిర్ణయించుకొనవలెను. శాస్త్రములే ప్రమాణములు. తనబుద్ధి ప్రమాణము అనుకొనరాదు. కార్యాకార్యనిర్ణయము గంభీరవిషయము. దానిని శ్రుతి, స్మృతి, పురాణేతిహాసాదులు బోధించును. శాస్త్రములయందలి ప్రవర్తక నివర్తకవాక్యములను అనుసరించి కర్మలను ఆచరించుచు ఆకర్మల

నుండి నివృత్తినిపొందుచు ఉండువారలే అంతఃకరణసిద్ధిద్వారా యోగ సిద్ధిని, బ్రహ్మసుఖమును పొందగలరు.

## శ్రేయః ప్రేయములు

కార్యము అనగా చేయదగినది. అది శ్రేయము. అకార్యము ఆచరించరానిది. అది ప్రేయము. దీనినిగురించి శ్రుతి ఇట్లు చెప్పు చున్నది.

*అన్యచ్ఛ్రేయోఽన్యదుతైవ ప్రేయః తే ఉభే నానార్థే పురుషం సినీతః।*
*తయోః శ్రేయ ఆదదానస్య సాధుర్భవతిహీయతేఽర్థాద్య ఉ ప్రేయోవృణీతే॥*

"శ్రేయము వేరు, ప్రేయము వేరు. వాని అర్థముకూడ వేరు. ఈ రెండును మనుష్యుని పొందును. వీనిలో శ్రేయమును గ్రహించు వాడు శుభమును పొందును. ప్రేయమునుకోరువాడు కళ్యాణప్రాప్తి అనెడు అర్థమును పొందలేడు."

*శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్యమేతః తౌ సంపరీత్య వివినక్తి ధీరః।*
*శ్రేయో హి ధీరోఽభిప్రేయసో వృణీతే ప్రేయోమన్దో యోగక్షేమాద్వృణీతే॥*

ప్రేయమును, ప్రేయమును మానవుని సమీపించును. వివేకి రెంటిని పరీక్షించి శ్రేయమును కోరును. అవివేకి యోగక్షేమముల కొరకు (అప్రాప్యమును పొందుటకును, ప్రాప్తమును రక్షించుకొనుట కును) ప్రేయమును కోరును.

ఉదాహరణమునకు త్రిదోషములు కలిగినప్పుడు రోగికి పెరుగు త్రాగవలెనను కోరిక కలుగును. అతనికి పెరుగుత్రాగుట ప్రియమే. కాని అతనికి అందు శ్రేయము లేదు. చేదుమందు అతనికి ప్రియము కాదు. కాని ఆమందును సేవించినచో అతని బాధ నివృత్తి అగును. అటులనే భవరోగముచే బాధపడు మానవునకు విషయోపభోగము ప్రియముగానుండును. కాని అందు అతని శ్రేయము లేదు. విషయా దులనుండి చిత్తవృత్తులను నిరోధించుట అతనికి ప్రియముకాదు. కాని

అవి భవరోగమునకు ఔషధములు. వానిచే ఆతనికి కళ్యాణము కలుగును. శాస్త్రసమ్మతమగు పురుషార్థము పరమార్థమును– అనగా కళ్యాణమును కలుగజేయును. శాస్త్రవిరుద్ధమగు పురుషార్థము అకళ్యాణమును కలుగజేయును అని యోగవాశిష్ఠము చెప్పుచున్నది:—

ఉచ్ఛాస్త్రం శాస్త్రితం చేతి పౌరుషం ద్వివిధం స్మృతమ్।
తత్రోచ్ఛాస్త్రమనర్థాయ పరమార్థాయ శాస్త్రితమ్॥

అనంతరము స్వామిశ్రీప్రకాశానందులవారు డా. లల్లూభాయితో ఇట్లనిరి:– “మీరు అన్నివ్యవహారములనుండియు నివృత్తిని చెందియున్నారు. మీ ఉద్యోగమునుండికూడ విరమణమును పొంది ఉన్నారు. ఇప్పుడు మీరు తలచినది చేయగలరు. కావున ఏకాంతమున కూర్చొని యోగాభ్యాసముచేసి సుఖమును పొందుడు. లేనిచో అవిద్యాబంధమున చిక్కువడుదురు.”

బృహదారణ్యకము చెప్పునది వినుడు:—

ఇహైవ సన్తోఽథ విద్మః తద్వయం న చేదవేదిర్మహతీ వినష్టిః।
యే తద్విదురమృతాస్తే భవన్త్యథేతరే దుఃఖమేవాపి యన్తి॥

“ఈలోకమునందుండగనే బ్రహ్మమును తెలిసికొనగలము అట్లు తెలిసికొనకపోయినచో మీకు మహాపకారము కలుగును. బ్రహ్మమును తెలిసికొనినవారు అమృతులగుదురు. తెలిసికొననివారు దుఃఖమును పొందుదురు.”

తరువాత స్వామిశ్రీనిత్యానందులవారి అనుమతితో కాళాభాయి మొదలగువారు జేతపురమును, స్వామిశ్రీప్రకాశానందులవారు వీరపురమును వెళ్లిరి.